# సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్

తెలంగాణ రాష్ట్ర కమిటి

# CENTRE OF INDIAN TRADE UNIONS

Telangana State Committee

అధ్యక్షులు : చుక్క రాములు | ప్రధాన కార్యదర్శి : ఎం. సాయిబాబు


ప్రచార/ప్రచురణార్థం | తేది : 01-02-2021

## కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్
## కార్మికవర్గాన్ని విస్మరించిన కేంద్ర బడ్జెట్

– సిఐటియు

ఆత్మనిర్భర్ భారత్, ఆరోగ్య భారత్, మౌళిక రంగాల కల్పన, విద్య, పాలనా సంస్కరణలను లక్ష్యాలను ఘనంగా ప్రకటించిన 2021–22 కేంద్ర బడ్జెట్ రాష్ట్ర కార్మికవర్గానికి తీవ్ర హాని కలిగించేదిగా ఉన్నదని, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ఈ ప్రక్రియను సిఐటియు తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలలో భాగంగానే వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలను తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిన ఈ బడ్జెట్‌ను ఉద్యోగులు, కార్మికులతో పాటు యావత్ ప్రజానీకం వ్యతిరేకించాలని సిఐటియు కోరుతున్నది. గత ఆరేళ్ళలో బిజెపి ప్రభుత్వం అమలు జరిపిన ఆర్థిక సంస్కరణలు, కరోనా కష్టాల్లోనూ ప్రభుత్వ రంగాన్ని బలహీనం చేసి కోట్లాది కార్మికవర్గానికి ఉపాధిని పోగొట్టింది. విదేశీ, స్వదేశీ గుత్త సంస్థలకు వేల కోట్లు లాభాలు కట్టబెట్టినందువల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వ్యవస్థ మరింత సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో దేశ ఆర్థిక సార్వభౌమత్వాన్ని మరింత బలహీనపరిచే విధంగా ప్రతిపాదించిన 2021–22 బడ్జెట్‌ను రాష్ట్రంలోని ఉద్యోగులు, కార్మికులు వ్యతిరేకిస్తూ నిరసనలు తెలపాలని సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపునిస్తున్నది.

ఎల్ఐసిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 49 శాతం నుండి 74 శాతానికి పెంచి సంస్థను విదేశీ యాజమాన్యాలకు అప్పగించింది. వ్యూహాత్మక భాగస్వామ్యం పేరుతో పెట్టుబడుల ఉపసంహారణను ప్రభుత్వరంగ సంస్థల్లో 1.75 లక్షల కోట్లు లక్ష్యంగా నిర్ణయించి ప్రభుత్వరంగాన్ని ధ్వంసం చేయడానికే నిశ్చయించుకున్నది. ఒక జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని, రెండు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను అమ్మేయాలని ప్రతిపాదించింది. గత మూడేళ్ళలో రూ. 1.20 లక్షల కోట్లు పబ్లిక్ రంగ బ్యాంకులకు కేటాయించడమే కాకుండా, ఈ బడ్జెట్‌లోనూ రీక్యాపిటలైజేషన్ పేరిట రూ. 20 వేల కోట్లు కేటాయించడం కార్పొరేట్ మొండి బాకీల రద్దుకు వినియోగించడం పబ్లిక్ సెక్టార్ బ్యాంకింగ్ వ్యవస్థను ధ్వంసం చేయడానికే దారి తీస్తుంది. పెట్టుబడుల ఉపసంహారణకు ప్రత్యేక డ్యాష్ బోర్డును పెడతామని చెప్పడం బిజెపి ప్రభుత్వ సరళీకృత విధానాలకు పరాకాష్ట. నాలుగు లేబర్ కోడ్‌లను అమలుపరుస్తామని చెబుతూ అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనాలను అమలు చేస్తామని ప్రకటించడం పచ్చి మోసం. అసంఘటిత రంగంలో కీలకమైన నిర్మాణ రంగం పుంజుకోవాలని చెబుతూనే అందుకు తగిన ప్రోత్సాహకం ఈ బడ్జెట్‌లో ప్రకటించలేదు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఆదుకోవాలని దేశవ్యాప్తంగా బలమైన ఒత్తిడి ఉన్నప్పటికీ కేవలం రూ. 15,700 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నది. కరోనా కాలంలో తీవ్రంగా ఉపాధి కోల్పోయిన ట్రాన్స్‌పోర్ట్, భవన నిర్మాణం, వలస కార్మికులు తదితర కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికులను ఆదుకునే ఏ చర్యా ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించలేదు. అంగన్‌వాడీ, ఆషా, మధ్యాహ్న భోజనం, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు, ఉపాధి హామీ తదితర స్కీమ్‌లను బలోపేతం చేయడం గానీ, ఉద్యోగ భద్రత గురించి గానీ ప్రస్తావించకపోవడం శోచనీయం.

ఉద్యోగ భద్రతకు, ఉపాధి కల్పనకు, ప్రభుత్వరంగ పరిరక్షణకు తీవ్ర విఘాతం కల్గించే ఈ బడ్జెట్‌ను కార్మికవర్గంతో పాటు అన్ని తరగతుల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని సిఐటియు కోరుతున్నది.

(చుక్క రాములు)
రాష్ట్ర అధ్యక్షులు

(పాలడుగు భాస్కర్)
రాష్ట్ర కార్యదర్శి